

చదువులు సాగేదెలా?

బీబీపేటలోని జూనియర్ కళాశాలలో లెక్చరర్లు లేకపోవడంతో పాఠాలు బోధించేవారు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో ▸



అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని కామారెడ్డి పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.1 /22.6

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం'



ఎల్లారెడ్డిరూరల్: రైతులకు ఇచ్చిన రుణ మాఫీ హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. బుధవారం ఆయన ఎల్లారెడ్డిలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రూ. 2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తోందన్నారు. ఇప్పటివరకు రూ. 1.50 లక్షలలోపు రుణాలను మాఫీ చేశామన్నారు. 15వ తేదీలోగా రూ. 2 లక్షలలోపు రుణాలను మాఫీ పూర్తి చేస్తామన్నారు. రైతులు రుణ విముక్తి పొందడం ఆనందంగా ఉందన్నారు.

జిల్లాలో 30, 30ఏ పోలీస్ యాక్టు అమలు

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఏడో తేదీ వరకు 30, 30 ఏ పోలీస్ యాక్టు అమలులో ఉంటాయని ఎస్పీ సింధు శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుశాఖ అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు, ఆందోళనలు చేపట్టరాదని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా ఫైర్ ఆఫీసర్‌గా సుధాకర్

కామారెడ్డి క్రైం: జిల్లా అగ్నిమాపక అధికారిగా సుధాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

'సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలి'



బాన్సువాడ: సైబర్ నేరాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని ఎస్పీ సింధు శర్మ సూచించారు. బుధవారం ఆమె బాన్సువాడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. సీఐతో మాట్లాడి కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చేవారికి న్యాయం జరుగుతుందనే భరోసా కల్పించాలన్నారు. కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. డయల్ 100కు ఫోన్ రాగానే స్పందించి ఘటనా స్థలానికి చేరుకోవాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టౌన్, రూరల్ సీఐలు కృష్ణ, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీలో చిక్కుముళ్లెన్నో?

■ మహ్మద్‌నగర్‌కు చెందిన కోమటిపల్లి రాజమణి స్థానిక యూనియన్ బ్యాంకులో రూ.98,300 పంటరుణం తీసుకున్నారు. రూ.లక్షలోపు రుణమాఫీకి ఆమె అర్హురాలు. అయితే రుణం మాఫీ కాకపోవడంతో అధికారులను సంప్రదించగా.. "మీ ఆధార్ నంబరు మీద వేరే వ్యక్తి పేరు ఉంది" అని వారు సమాధానమివ్వడంతో ఆమె అవాక్కయ్యింది.

■ మహమ్మద్‌నగర్ మండలానికి చెందిన యలగందల కాశీనాథ్ స్థానిక యూనియన్ బ్యాంక్, నిజాంసాగర్‌లోని డీసీసీబీలో కలిపి రూ. 1.93 లక్షల వరకు పంట రుణం తీసుకున్నారు. అయితే కుటుంబ రుణ వివరాల జాబితాలో ఆయన ఆధార్‌నంబర్‌తోనే మరో వ్యక్తి పేరుంది. దీంతో తన రుణం మాఫీ అవుతుందో లేదోనని కాశీనాథ్ ఆందోళన చెందుతున్నారు.

■ మహమ్మద్‌నగర్‌కు చెందిన చింతకింది కాశయ్య యూనియన్ బ్యాంక్‌లో రూ. 71,272 పంట రుణం తీసుకున్నారు. ఆయన భార్య సువర్ణ పేరుతో మరో రూ. 44,764 క్రాప్‌లోన్ ఉంది. రెండో విడతలోనూ రుణమాఫీ కాకపోవడంతో అధికారులను సంప్రదించగా.. రుణ ఖాతాలోని పేరు, ఆధార్‌లోని పేర్లు వేరుగా ఉండడంతో రుణమాఫీ కాలేదన్న సమాధానం వచ్చింది.

గందరగోళంగా అర్హుల జాబితా

- ఒకే ఆధార్ నంబర్‌తో ఇద్దరు ముగ్గురు రైతుల వివరాలు
- రుణ ఖాతా, ఆధార్‌లలో తప్పులతో లబ్ధిదారుల జాబితాలో పేర్లు మాయం
- రేషన్‌కార్డు లేక మరికొందరు మాఫీకి దూరం
- ఆందోళనతో అధికారుల చుట్టూ తిరుగుతున్న రైతులు
- గ్రీవెన్స్ సెల్‌లో 1,739 ఫిర్యాదులు నమోదు

పంట రుణాల మాఫీ ప్రకటనతో ఆనందించిన అన్నదాతలు.. అప్పెందుకు మాఫీ కాలేదో తెలియక అయోమయానికి గురవుతున్నారు. కుటుంబ సభ్యులందరి పేరుతో కలిపి రూ. 1.50 లక్షలలోపు రుణమే ఉన్నా.. అర్హుల జాబితాలో పేరెందుకు లేదోనని ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు చెబుతున్న కారణాలు విని అవాక్కవుతున్నారు. చిన్నచిన్న పొరపాట్లు, సాంకేతిక కారణాలతో రుణ విముక్తి పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో 1.70 లక్షల మంది రైతులు బ్యాంకుల ద్వారా రూ. 1,458.73 కోట్ల విలువైన పంట రుణాలు తీసుకున్నారు. ప్రభుత్వం 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 మధ్య కాలంలో తీసుకున్న పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఈనెల 18న రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేసింది. అయితే రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులు జిల్లాలో లక్షపైచిలుకు ఉండగా.. 49,541 మంది రైతులకు సంబంధించిన రూ. 233.41 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయి. యాభై వేల మందికిపైగా రైతులకు రుణమాఫీ జరగలేదు. రెండో విడతకు సంబంధించి ఈనెల 30న రూ. 1.50 లక్షలలోపు రుణాలను మాఫీ చేయగా.. ఇందులో జిల్లాలో 24,816 మంది రైతులకు సంబంధించి రూ. 211.72 కోట్లు మాఫీ అయ్యాయి. కుటుంబ సభ్యులందరి పేరుతో కలిపి రూ. 1.50 లక్షలోపు రుణమే ఉన్నా మాఫీ కాకపోవడంతో చాలామంది ఆందోళన చెందుతున్నారు.

ఫిర్యాదుల వెల్లువ...

ప్రభుత్వం ఇప్పటివరకు రెండు విడతల్లో కలిపి రూ. 1.50 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేసినట్లు ప్రకటించింది. అయితే రెండు విడతల్లోనూ రుణమాఫీ కాని రైతులు అధికారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. వ్యవసాయ విస్తీర్ణాధికారులు, వ్యవసాయ అధికారులను సంప్రదించి కారణాలు తెలుసుకుంటున్నారు. జిల్లా వ్యవసాయ శాఖలో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్‌లు చేసి తమ రుణం ఎందుకు మాఫీ కాలేదన్నదానిపై తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. అధికారులు వారి ఆధార్ నంబరును ఆన్‌లైన్లో చెక్ చేసి కారణాలను వివరిస్తున్నారు. రుణమాఫీకి సంబంధించి ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌లో ఇప్పటివరకు 1,739 ఫిర్యాదులు నమోదయ్యాయని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. రైతుల వివరాలను నమోదు చేసుకుంటున్నామని పేర్కొన్నారు.

తిరస్కరణకు కారణాలు..

రుణ మాఫీ అవకాశం కోల్పోయిన రైతులు తమకు ఎందుకు మాఫీ కాలేదో తెలుసుకుంటే చాలావరకు ఒకే ఆధార్ నంబరుపై ముగ్గురు, నలుగురు రైతుల పేర్లు ఉన్నట్లు వెల్లడవుతోంది. అలాగే బ్యాంకులో పంట రుణం తీసుకున్న రైతు పేరు, ఆధార్ పేరు సరిపోకపోవడంతోనూ చాలామంది పేర్లను పక్కన పెట్టారు. కొందరి ఆధార్ కార్డులలో ఇంటి పేరుకు బదులుగా కులం పేరు రికార్డు కావడంతో వారూ రుణమాఫీకి దూరమయ్యారు. కుటుంబం యూనిట్‌గా రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించగా.. ఇతర వ్యక్తుల పేర్లూ ఒకే కుటుంబంలో నమోదు చేయడంతో వందలాది మందికి ప్రయోజనం చేకూరలేదు. రుణమాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదని ప్రభుత్వం పేర్కొన్నా.. కుటుంబ నిర్ధారణ జరగని కారణంగా రేషన్ కార్డులలో పేర్లు లేనివారికి పంటరుణం మాఫీ కాలేదు. ఇలా పలు కారణాలతో అర్హులైన రైతులకూ లబ్ధి చేకూరకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించి, అర్హులందరికీ రుణమాఫీ వర్తించేలా చూడాలని కోరుతున్నారు.

పేరు తప్పుగా ఉందట



దేశాయిపేట్ శివారులో రెండెకరాల భూమి ఉంది. రూ.80 వేల పంట రుణం తీసుకున్నా. అధికారులను అడిగితే పట్టాదారు పాసుపుస్తకంలో ఒకలా, ఆధారుకార్డులో మరోలా పేరు ఉందని అంటున్నారు. సర్కారు స్పందించి రుణమాఫీ అయ్యేలా చూడాలి.

– భూదవ్వ, రైతు, బాన్సువాడ

రుణ మాఫీ కాలేదు..



నాకు 39 గుంటల భూమి ఉంది. కెనరా బ్యాంక్‌లో రూ. 30 వేల పంటరుణం తీసుకున్నా. రుణమాఫీ కాకపోవడంతో వ్యవసాయ అధికారులను అడిగితే ఆధార్‌లోని పేరు, రుణ ఖాతాలోని పేరు వేరుగా ఉన్నాయని చెబుతున్నారు. ప్రభుత్వం న్యాయం చేయాలి.

– బొందిలి భగత్, రైతు, పెద్దకొడప్‌గల్

లోన్ మాఫీ చేయాలి



నేను 2020లో రూ. 1.40 లక్షల క్రాప్‌లోన్ తీసుకున్నా. ఏటా రెన్యువల్ చేస్తున్నా. రెండో విడతలో రుణ మాఫీ అవుతుందని ఆశించా. కానీ కాలేదు. అధికారులను అడిగితే ఆధార్ నంబర్ తప్పు ఉందంటున్నారు. లోన్ మాఫీ చేయాలి.

– సాతెల్లి సావిత్రి, రైతు, కాస్లాబాద్

రూ. 9,583 మాత్రమే మాఫీ అయ్యింది



నేను చిల్లర్గి సహకార సంఘంలో గతేడాది రూ. 1.50 లక్షల రుణం తీసుకున్నాను. రూ. 9,583 మాత్రమే మాఫీ అయ్యింది. బ్యాంకు అధికారులను కలిసి అడిగితే మూడో విడతలో వస్తుందేమో అంటున్నారు. పొరపాట్లను సవరించి, మొత్తం మాఫీ అయ్యేలా చూడాలి.

– షకీల్, రైతు, పిట్లం

సీఎంఆర్‌పై దృష్టి సారించండి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

- వచ్చే నెలాఖరు వరకు లక్ష్యాన్ని చేరుకోవాలి
- లేకపోతే చర్యలు తప్పవు
- రైస్‌మిల్లర్లతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: రైస్‌మిల్లర్లు కస్టం మిల్లింగ్ రైస్‌పై దృష్టి సారించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని రైస్ మిల్లర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023–24 ఖరీఫ్ పంటకు సంబంధించి ఇప్పటివరకు 50 శాతం కంటే తక్కువ సీఎంఆర్ డెలివరీ చేసివారు సెప్టెంబర్ నెలాఖరు వరకు వంద శాతం లక్ష్యాన్ని చేరుకునేలా మిల్లింగ్‌ను వేగవంతం చేయాలన్నారు. 2023- 24 యాసంగి సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్‌ను కూడా త్వరగా డెలివరీ చేయాలన్నారు. 2022–23 ఖరీఫ్‌కు సంబంధించి సీఎంఆర్ పూర్తి చేయనివారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఆర్ఆర్ యాక్ట్ కింద వారి ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు. పౌరసరఫరాల సంస్థకు చెందిన నాయబ్ తహసీల్దార్‌లు తమ పరిధిలోని మిల్లులన్నిటిని తనిఖీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానందం, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శేఖర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కంచర్ల లింగం, జిల్లాలోని రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

'26 లక్షల మొక్కలు నాటాలన్నది లక్ష్యం'



నల్లమడుగులో మొక్కను నాటుతున్న డీఆర్‌డీవో చందర్‌నాయక్, అధికారులు

లింగంపేట: వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో 26 లక్షల మొక్కలు నాటాలన్నది లక్ష్యంగా నిర్దేశించినట్లు డీఆర్‌డీవో చందర్‌నాయక్ పేర్కొన్నారు. బుధవారం ఆయన నల్లమడుగులో నిర్వహించిన వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ స్థలాలు, పొలాలు, ఇళ్ల వద్ద విరివిగా మొక్కలు నాటాలని ఉపాధి హామీ, ఐకేపీ, గ్రామ పంచాయతీల సిబ్బందికి సూచించారు. అనంతరం లింగంపేట సమీపంలోని నాగన్నగారి మెట్ల బావిని సందర్శించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. మొక్కలు నాటడం, పారిశుధ్య నిర్వహణలో ఎక్కడా నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రోడ్డు నుంచి నాగన్నగారి బావి వరకు ఫార్మేషన్ రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పని పూర్తికానివారితో పనులు చేయించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో వన మహోత్సవంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 17.88 లక్షలు, అటవీ శాఖ ఆధ్వర్యంలో 8.12 లక్షల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 14.50 లక్షల మొక్కలు నాటామన్నారు. ఆయన వెంట ఎంపీడీవో నరేశ్, ఎంపీవో మలహరి, ఏపీఎం శ్రీనివాస్, ఎంపీవో అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

జలకళ



నిండుగా ప్రవహిస్తున్న లింగంపేట పెద్దవాగు



పెద్దఎక్లార గేట్ సమీపంలో ప్రవహిస్తున్న వాగు



మహమ్మద్‌నగర్ శివారులో పంట పొలాలను ముంచెత్తిన వరద ప్రవాహం

లింగంపేట/మద్నూర్/మాచారెడ్డి : జిల్లాలోని పలు ప్రాంతాలలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో పలు వాగులు, వంకలు పారుతున్నాయి. భారీ వర్షంతో లింగంపేట మండలకేంద్ర సమీపంలోని పెద్దవాగు ఈ సీజన్‌లో రెండోసారి ప్రవహిస్తోంది. మద్నూర్ మండలంతో పాటు ఎగువన ఉన్న మహారాష్ట్రలో వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పెద్దఎక్లార గేట్ సమీపంలో గల మంజీర వాగు పారుతోంది. మాచారెడ్డి మండలంలోని పాల్వంచ వాగు జలకళను సంతరించుకుంది.




ప్రవహిస్తున్న పాల్వంచ వాగు

'సింగితం'లోకి 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: స్థానిక ప్రాంతాలలో వాన లేకపోయినా.. సింగితం మాత్రం పోటెత్తింది. ఎగువన బాన్సువాడ, వర్ని, మోస్రా, చందూర్, నిజామాబాద్ రూరల్ ప్రాంతాల్లో కుండపోతగా కురిసిన వర్షానికి వాగులు, ఒర్రెలు పారుతున్నాయి. ఆ నీరు సింగితం రిజర్వాయర్‌ను చేరుతోంది. బుధవారం 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో రిజర్వాయర్ కుడి, ఎడమ అలుగులు పారుతున్నాయి. వరద ఉధృతి కొనసాగుతుండడంతో మూడు వరద గేట్లను ఎత్తి ప్రధాన కాలువకు 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని నీటి పారుదలశాఖ వర్క్‌ఇన్‌స్పెక్టర్ కాశీనాథ్ తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం(416.550 మీటర్లు)తో నిండుకుండలా కళకళలాడుతోంది.

పొలాలను ముంచెత్తిన వరద నీరు

సింగితం రిజర్వాయర్ అలుగుపైనుంచి వరద నీరు పొంగి పొర్లుతుండడంతో వాగులో ప్రవహిస్తున్న వరద నీరు పంటపొలాలను ముంచెత్తింది. దీంతో వాగుకు



సింగితం వరద గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నర్వ, మహమ్మద్‌నగర్, శేర్‌ఖాన్‌పల్లి, సింగితం గ్రామ శివార్లలోని వరి పైరు నీటమునిగింది. వరద నీటి ప్రవాహంతో ఇసుక మేటలు వేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

'పోచారం'లోకి 1,881 క్యూసెక్కులు..



పోచారం ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్న వరద నీరు

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టులో నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. లింగంపేట, గుండారం వాగుల ద్వారా 1,881 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. బుధవారం సాయంత్రానికి ప్రాజెక్టు నీటిమట్టం 14 అడుగులకు చేరుకుంది.

క్లుప్తంగా

గంజాయి విక్రయిస్తే ఆస్తులు జప్తు చేస్తాం



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలతో పాటు వారి ఆస్తులను జప్తు చేస్తామని ఎస్సై మహేందర్ తెలిపారు. మండలంలోని పోచారం తండా వాసులతో గంజాయి నిర్మూలనపై ఎస్సై మహేందర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా పోచారం తండా గంజాయికి నిలయంగా మారిందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సాయి శివ, రవి, అంజి తండా వాసులు పాల్గొన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి



మద్నూర్(జుక్కల్) : వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి రైతులు అధిక దిగుబడులు సాధించాలని బిచ్కుంద ఏడీఏ లక్ష్మీప్రసన్న సూచించారు. మండలంలోని సుల్తాన్‌పేట్ శివారులోని పంటలను బుధవారం ఆమె పరిశీలించారు. వానాకాలం పంటలపై వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ఆమె రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రస్తుతం సోయాబీన్, పెసర, మినుము, కంది పంటలకు పురుగులు ఆశిస్తే మందులు పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సంయుక్త, రైతులు విజయ్‌పటేల్, దత్తు, రాజు, జిలానీ తదితరులున్నారు.

కళకళలాడుతున్న గాంధారి జెడ్పీ పాఠశాల



గాంధారి(ఎల్లారెడ్డి) : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కళకళలాడుతోంది. పాఠశాలలో 320 మంది విద్యార్థులుండగా కొత్తగా 230 మంది విద్యార్థులు కొత్తగా చేరారని హెచ్‌ఎం వెంకటేశ్వర్ గౌడ్ తెలిపారు. పాఠశాలలో మౌళిక సదుపాయాలతో పాటు తగినంత మంది ఉపాధ్యాయులున్నారన్నారు. ఉపాధ్యాయుల సమయపాలన అంకితభావంతో అన్ని సబ్జెక్టుల బోధనతో కొత్తగా విద్యార్థులు చేరుతున్నారని హెచ్‌ఎం సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడింలో బోధిస్తున్నామని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఆయన కోరారు.

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు



భిక్కనూరు : కంటి సమస్యలను ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని కంటి వైద్యాధికారి రవీందర్ చెప్పారు. బుధవారం మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతి బుధవారం కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి హేమిమా ఉన్నారు.

లెక్చరర్లు లేక చదువులు సాగేదెలా?

- జీబీపేట కళాశాల విద్యార్థుల ఆవేదన
- కలెక్టరేట్‌కు వచ్చి నిరసన



జిల్లాకేంద్రంలోని కలెక్టర్ కార్యాలయానికి తరలివచ్చిన బీబీపేట విద్యార్థినులు

కామారెడ్డి క్రైం : బీబీపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు బుధవారం కలెక్టర్ కార్యాలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీబీపేట మండల కేంద్రంలో కళాశాలలో ఏర్పాటు చేసి లెక్చరర్లను నియమించడం మరిచిపోయారన్నారు. ఉన్న లెక్చరర్లు కూడా సరిగ్గా బోధన చేయకపోవడంతో తాము ఇంటర్ ఫస్టియర్‌లో ఒక్కరు కూడా ఉత్తీర్ణత సాధించలేకపోయామన్నారు. కళాశాల ప్రారంభమై ఇన్ని రోజులైన ఒక్క అధ్యాపకుడు కూడా తమ కళాశాల వైపు రాలేదన్నారు. అధ్యాపకులు వచ్చేవరకు దోమకొండ కళాశాలలో చదువుకోవాలంటున్నారని, తాము అక్కడికి వెళ్లమని, బీబీపేట కళాశాలలోనే తాము చదువుకుంటామన్నారు.

కలెక్టర్ దగ్గరికి వచ్చినా..

గత నెల రోజుల క్రితం కలెక్టర్ దగ్గరికి వచ్చామని త్వరలో లెక్చర్లను ఏర్పాటు చేస్తామన్నారు. కానీ ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదన్నారు. మళ్లీ తాము సెకండియర్‌లో కూడా ఫెయిల్ అయితే తమ ఏడాది చదువు వృథా అవుతుందని, అలాకాకుండా ఉండాలంటే తమ టీసీలు తమకివ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను దోమకొండకు వెళ్లి చదువుకోమని చెప్పామన్నారు. బీబీపేటకు త్వరలోనే అధ్యాపకులను నియమిస్తామని, అప్పటి వరకు విద్యార్థులను దోమకొండ కళాశాలలో చదువుకోవాలని సూచించాం.

'డబుల్' సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఇందుప్రియ

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ కాలనీని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ బుధవారం పరిశీలించారు. ఇటీవల కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తో కలిసి డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెల్సుకున్నారు. బుధవారం కాలనీల్లో చేపట్టాల్సిన పనుల గురించి అక్కడ ఉంటున్న వారిని అడిగి తెలుసుకున్నారు. డబుల్ బెడ్ రూమ్ రోడ్డుకు మొరం వేసి, మురికి కాలువలు శుభ్రం చేయించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని స్థానిక ప్రజలు మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకరాగా సానుకూలంగా స్పందించారు. గురువారం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి లబ్ధిదారులకు పట్టాలు అందించేలా చొరవ తీసుకుంటామన్నారు. చెత్తను రోడ్డు పై వేయవద్దని కాలనీ వాసులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ సుజాత, వార్డ్ కౌన్సిలర్ జహీరా బేగం యామిన్, పాత శివ కృష్ణమూర్తి, చాట్ల వంశీ తదితరులున్నారు.

అధ్యాపకులకు సన్మానం



సదాశివనగర్(ఎల్లారెడ్డి):మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద గల గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో బుధవారం పదోన్నతి పొందిన వెంకటేశ్వర్ రావు, చంద్రిక అధ్యాపకులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా కళాశాలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఉదయిని, అకాడమిక్ కోఆర్డినేటర్ వనజ,అధ్యాపకులు ఉన్నారు.

హాస్టల్‌లో పరిశుభ్రత పాటించాలి



వంటలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్

భిక్కనూరు : హాస్టళ్లో పరిశుభ్రత పాటించాలని సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం తెలంగాణ విశ్వవిద్యాలయంలోని దక్షిణ ప్రాంగణంలో బాలుర హాస్టల్ను హాస్టల్ వార్డెన్ డాక్టర్ యాలాద్రితో కలిసి ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ గౌడ్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు, హాస్టల్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. వంట చేసే సమయంలో ఆప్రాన్స్, చేతిగ్లౌజులు, కిచెన్ క్యాప్పు ఖచ్చితంగా ధరించాలని సూచించారు. వారు ధరించాల్సిన యాప్రాన్స్, హ్యాండ్ గ్లౌజ్, క్యాప్స్ ప్రిన్సిపాల్ సుధాకర్ గౌడ్ అందించారు. విద్యార్థులకు హాస్టల్ సిబ్బందికి వసతిగృహంలో పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.నారాయణ, కేర్ టేకర్ వేణుమాధవ్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

బోరు మోటార్ ప్రారంభం



కామారెడ్డి రూరల్:కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 23వ వారుడ్ న్యూ ఇందిర నగర్ కాలనీలో ప్రజలకు నీటి సమస్య ఉన్నందున కొత్త బోర్ వేసి, మోటర్ బిగించి ప్రజల నీటి సమస్యను తీర్చారు. ఈ బోర్ మోటార్‌ను కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ, వార్డు కౌన్సిలర్ తేజపు మానస ప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ పాత శివ కృష్ణమూర్తి, చాట్ల వంశీ, రవీందర్ గౌడ్, ఇమ్రాన్ తదితరులున్నారు.

పీజీ పరీక్షలకు 20 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న పీజీ ఇంటిగ్రేటెడ్, పీజీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో బుధవారం 20 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. క్యాంపస్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, న్యాయ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో పీజీ ఇంటిగ్రేటెడ్ 6,8,7,9,10వ సెమిస్టర్, పీజీ 1, 3వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఉదయం నిర్వహించిన పరీక్షలో 206 మందికి 186 మంది హాజరయ్యారు.

న్యాయ కళాశాలలో మూట్‌కోర్టు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బీ చివరి సంవత్సరం విద్యార్థులకు నమూనా మూట్ కోర్టుపై బుధవారం మౌఖిక పరీక్షలు నిర్వహించారు. నిజామాబాద్‌కు చెందిన సీనియర్ న్యాయవాది రామాగౌడ్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. విద్యార్థులకు కోర్టుల్లో నిర్వహించే సంఘర్షణ, వాజ్యముల విచారణ గురించి పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్, విభాగాధిపతి కె.ప్రసన్నరాణి, బీవోఎస్ చైర్మన్ జెట్లింగ్ ఎల్లోసా, అధ్యాపకులు నాగజ్యోతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డీఏవోగా విజయ్‌కుమార్



బాన్సువాడ : బాన్సువాడ ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్(డీఏవో)గా విజయ్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. బాన్సువాడలో డీఏవోగా పనిచేసిన రామారెడ్డి తహసీల్దార్‌గా బదిలీ కావడంతో ఆమె స్థానంలో విజయ్‌కుమార్ బదిలీపై వచ్చారు. కొత్తగా వచ్చిన డీఏవోకు ఆర్డీవో రమేష్ రాథోడ్, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

గోదావరిలో దూకి వివాహిత ..



తుమ్మల లక్ష్మి మృతదేహం

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ధర్మపురి కాలనీకి చెందిన తుమ్మల లక్ష్మి(32) అనే వివాహిత బాసరలోని గోదావరి నదిలో బుధవారం దూకి ఆత్మహత్య చేసుకుంది. నిజామాబాద్ నుంచి తల్లిగారి ఇంటికి నవీపేట్‌కు వెళ్లినట్లు పోలీసుల ద్వారా తెలిసింది. అక్కడి నుంచి బాసర వెళ్లి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. బాసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో దూకి..



కవిత మృతదేహం

ధర్పల్లి: మండలంలోని రామడుగుకు చెందిన దుమాల కవిత (43) బుధవారం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దుమాల లక్ష్మణ్ భార్య కొన్ని రోజులుగా మతిస్థిమితం లేక బాధపడుతోంది. బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె గ్రామ సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


జీవితంపై విరక్తితో..

బోధన్‌రూరల్: అనారోగ్యానికి గురైన ఓ మహిళ నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది నీటి కుంటలో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సంగం గ్రామానికి చెందిన షేక్ షమీమ్(44)కు కొన్నేళ్ల నుంచి ఆరోగ్యం బాగుండడం లేదు. ఆస్పత్రుల్లో చూయించినా నయం కావడం లేదు. దీంతో నాటి నుంచి తాను చనిపోతానని కుటుంబ సభ్యులతో చెప్పేది. ఉదయం ఇంటి నుంచి వెళ్లిన షమీమ్ తిరిగి రాలేదు. కుటుంబీకులు గాలించగా నీటి కుంటలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. భర్త షేక్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాలువలో పడి ఒకరి మృతి

ఖలీల్‌వాడి: మద్యం మత్తులో కాలువలో పడి ఒకరు మృతి చెందిన ఘటన నగరంలోని బోర్గాం కాలువలో బుధవారం చోటు చేసుకుంది. నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని గాయత్రినగర్‌కు చెందిన సాయికుమార్(21) కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. బోర్గాం వద్ద కల్లు దుకాణంలో కల్లు తాగి వెళ్తుండగా మద్యం మత్తులో కాలువలో జారిపడి మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన బస్సు



బాల్కొండ: నిజామాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మెండోరా మండలం పోచంపాడ్ వద్ద జాతీయ రహదారి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈ ఘనటనలో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. బస్సు పోచంపాడ్ వద్దకు రాగానే రహదారి పై పశువులు అడ్డుగా రావడంతో పశువులను తప్పించబోయి బస్సు అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లిందన్నారు. ఆ సమయంలో బస్సులో 72 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.అనంతరం ప్రయాణికులను వేరే ఆర్టీసీ బస్సుల్లో గమ్యస్థానానికి తరలించారు. మెండోరా,హైవే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు చేపట్టారు.

బస్సు, బైక్ ఢీ: ముగ్గురికి గాయాలు



ఘటన స్థలిలో క్షతగాత్రులు

లింగంపేట: బస్సు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలైన ఘటన మండలంలోని గాంధీనగర్ శివారులో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కామారెడ్డి నుంచి లింగంపేట మండలం పొల్కంపేటకు వెళ్తున్న బైక్ గాంధీనగర్ శివారులో ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న చాకలి భూమయ్య, చాకలి నరేందర్, విద్యార్థిని చాకలి సంహితకు గాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108 అంబులెన్సులో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భీమ్‌గల్‌లో దొంగతనం



భీమ్‌గల్: పట్టణ కేంద్రంలో అర్ధరాత్రి దొంగతనం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని బోయిగల్లీకి చెందిన కోతల శ్రీనివాస్ ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి దొంగలు చొరబడ్డారు. కుటుంబీకులు ఓ గదిలో గాడ నిద్రలో ఉండగా మరో గదిలో ఉన్న 3.5 తులాల బంగారు ఆభరణాలు, 40 తులాల వెండిని అపహరించినట్లు పేర్కొన్నారు. క్లూస్ టీమ్ వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంధం చెట్టు దొంగతనం



తాడ్వాయి: మండలంలోని ఎండ్రియాల్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో గంధం చెట్టును గుర్తు తెలియని వ్యక్తులు నరికి దొంగలించినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. పాఠశాల ఆవరణలో కొనేళ్లుగా ఉన్న గంధం చెట్టును ఈనెల 29న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి చెట్టును నరికేశారన్నారు. చెట్టుకొమ్మలు, కాండం వదిలేసి గంధం మొద్దులను ఎత్తు కెళ్లారన్నారు. వాటి విలువ సుమారు రూ. 80వేల నుంచి రూ. లక్ష వరకు ఉంటుందన్నారు. సీసీ కెమెరాలు లేని చోట చెట్టును నరికేశారన్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

కుంగిన గంగమ్మ వాగు సర్వీస్ రోడ్డు



మూసివేసిన రామారెడ్డి-కామారెడ్డి రోడ్డు



రోడ్డు కుంగిపోవడంతో ప్రవహిస్తున్న నీళ్లు

- కన్నాపూర్, పోసానిపేట మీదుగా రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు

రామారెడ్డి : ఇటీవల కురిసిన వర్షాలకు గంగమ్మ వాగు వంతెన పక్కనుంచి ఏర్పాటు చేసిన సర్వీస్ రోడ్డు పూర్తిగా కుంగిపోయి వర్షం నీళ్లు ప్రవహిస్తున్నాయి. దీంతో రామారెడ్డి కామారెడ్డి ప్రధాన రోడ్డు వెంట పూర్తిగా రాకపోకలను పోలీసులు నిలిపివేయించారు.

ప్రజలకు ఇబ్బందులు..

గంగమ్మ వాగు వంతెన, గర్గుల్ వంతెనను ఏడాది క్రితం వంతెనకు రూ. 2 కోట్ల చొప్పున కేటాయించారు. పనులు సైతం ప్రారంభించారు. గర్గుల్ వంతెన పనులు పూర్తి చేసుకుని రాకపోకలు కొనసాగిస్తుండగా, రామారెడ్డి గంగమ్మ వంతెన పనుల నిర్మాణంలో తీవ్ర నిర్లక్ష్యంతో మధ్యలోనే ఆగిపోయాయి. ఫలితంగా వర్షాకాలంలో ఈ రోడ్డు వెంట అనేక గ్రామాల ప్రజలు కామారెడ్డి హైదరాబాద్‌కు రాకపోకలను కొనసాగించాల్సి ఉండగా వయా పోసానిపేట్, లేదంటే సదాశివనగర్, రెడ్డిపేట వైపు నుంచి 10 కిలో మీటర్ల అదనపు దూరభారంతో కామారెడ్డికి రాకపోకలను కొనసాగిస్తున్నారు. ప్రధానంగా వివిధ గ్రామాల నుంచి ప్రజలు పనుల నిమిత్తం జిల్లా కేంద్రం కామారెడ్డికి నిత్యం వందల సంఖ్యలో వెళ్తుంటారు.

వంతెన నిర్మాణం పనుల జాప్యం కారణంగా ఈ రోడ్డు మీదిగా వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వంతెనను పూర్తిచేసే అందుబాటులోకి తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గడ్డిమందు ఎంతపని చేసింది..

మాడిపోయిన మొక్కజొన్న పంట



బేగంపూర్ శివారులో మాడిపోయిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఈవో రూప

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మొక్కజొన్న పంటలో ఉన్న గడ్డిని తొలగించేందుకు గడ్డిమందు పిచికారీ చేయగా మొక్కజొన్న పంట పూర్తిగా మాడిపోయిన సంఘటన మండలంలోని బేగంపూర్‌లో చోటుచేసుకుంది. ఏఈవో రూప తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బేగంపూర్ గ్రామ శివారులో లంబడి చందు అనే రైతు తనకున్న రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశాడు. దాంట్లో గడ్డి బాగా పెరగడంతో గడ్డిమందు కొట్టాడు. రెండురోజుల తర్వాత చూడగా మొక్కజొన్న పంట పూర్తిగా మాడిపోయిందన్నారు. దీనిపై గడ్డిమందు కంపెనీ సిబ్బందికి సమాచారం ఇచ్చామని, వారిపై చర్యలు తీసుకుంటామని, రైతుకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

గాంధారిలో పంట పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి) : మండల పరిధిలోని పలు గ్రా మాల్లో బుధవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు నగేష్ కుమార్, మల్లయ్య, వ్యవసాయ సంచాలకులు వీరస్వామి, ఏవో నరేష్‌తో కలిసి పర్యటించారు. మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అధిక తేమ ఉన్న భూముల్లో మొక్కజొన్న ఆకులు రంగు మారుతుందన్నారు. మొక్క నుంచి మొగి వడలిపోతుందన్నారు. కాండాన్ని కర్ర నుంచి తీసి చీల్చి చూస్తే కకుళ్లి పోయి పసుపు పచ్చ రంగులో కనుబడుతుందన్నారు. వాసన చూసినట్లయితే కుళ్లిపోయిన కోడిగుడ్డ వాసన వస్తుందన్నారు. దీని నివారణకు 35 శాతం క్లోరిన్‌తో 4-5 కిలోల బ్లీచింగ్ పౌడర్ కలిపి సాళ్ల మధ్యలో వెదజల్లాలన్నారు. లేదా 4 గ్రాముల క్లోరిన్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు.

డీఎస్ సేవలు మరువలేనివి



డీఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మున్నూరు కాపు ప్రతినిధులు

ఖలీల్‌వాడి: ధర్మపురి శ్రీనివాస్ సేవలు మరువలేనివని, మూన్నూరుకాపుల ఐక్యతకు కృషి చేశారని నగర మూన్నూరు కాపు సంఘం ప్రతినిధి దారం సాయిలు అన్నారు. నగరంలోని ప్రగతినగర్‌లోని మున్నూరుకాపు కల్యాణ మండపంలో డీఎస్ సంస్మరణ సభను బుధవారం నిర్వహించారు. ఈ సంస్మరణ సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. డీఎస్‌తోనే మున్నూరు కాపులకు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు లభించిందని అన్నారు. దీంతోపాటు న్యాల్‌కల్ రోడ్డులో మున్నూరుకాపు కల్యాణ మండపానికి రెండెకరాల స్థలం ఇచ్చి నిధులు కేటాయించారని పేర్కొన్నారు. 1989లో ఎమ్మెల్యేగా డీఎస్ గెలుపునకు మున్నూరుకాపులు ఏకమైనట్లు తెలిపారు. నగరంలోని మున్నూరుకాపు సంఘాలతో పాటు ఇతర కుల సంఘాల భవనాలకు నిధులు కేటాయించారన్నారు. నిజామాబాద్ ఎమ్మెల్యేగా ప్రస్థానం ప్రారంభించిన డీఎస్ రెండుసార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పీసీసీ అధ్యక్షుడిగా పని చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటులో డీఎస్ పాత్ర కీలకమన్నారు. నిజామాబాద్‌ను నగరపాలక సంస్థగా మార్చి రోడ్లు, డ్రైనేజీని ఏర్పాటు చేశారని, నగర ప్రజలకు మంచినీటి కోసం అలీసాగర్ నుంచి మంచినీటిని తీసుకొచ్చి దాహార్తిని తీర్చారన్నారు. నగరంలోని 21 సంఘాలను ఏకతాటిపైకి తీసుకొచ్చారని అన్నారు. డీఎస్ మున్నూరుకాపుల గుండెలో చిరస్థాయిగా నిలిచి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో రాజేశ్వర్, వెంకటేశం తదితరులు ఉన్నారు.

బాధితుడికి పరిహారం చెల్లించాలి

- ఒకరిని గాయపర్చిన కేసులో కోర్టు తీర్పు

బోధన్: వ్యక్తిని తీవ్రంగా గాయపరిచిన కేసులో బాధితుడికి రూ. 25 వేలు నష్టపరిహారం చెల్లించాలని, కట్టలేని పక్షంలో మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని బోధన్ అసిస్టెంట్ సెషన్ కోర్టు జడ్జి దేవన్ అజయ్ కుమార్ బుధవారం తీర్పు ఇచ్చారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్ శంకర్ తెలిపిన ప్రకారం.. 2023 నవంబర్ 11న పోతంగల్ మండలంలోని కారేగాంలో ఎర్రోళ్ల సునీత ఇంటి ఎదుట ఆమె కుమారులు సాత్విక్, సిద్ధు ఎదురింటి రమేశ్ పిల్లలు లోకేశ్, కార్తీక్‌లు కలిసి కొట్టుకుంటుడగా అక్కడికి వచ్చిన సునీత భర్త యాదవరావు ఎందుకు కొట్టుకుంటున్నారని అడిగాడు. అదే సమయంలో రమేశ్ భార్య క్రాంతి వచ్చి యాదవరావును అసభ్య పదజాలంతో దూషించగా ఆయన అక్కడి నుంచి వెళ్లి గ్రామంలోని బాబు జగ్జీవన్‌రాం విగ్రహం వద్దకు వెళ్లాడు. విషయం తెలిసి క్రాంతి భర్త రమేశ్ ఇంట్లో ఉన్న గొడ్డలిని తీసుకొని యాదవరావుపై దాడి చేశాడు. దాడిలో యాదవరావు తలకు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దీంతో కోటగిరి పీఎస్‌లో సునీత ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై సందీప్ రమేశ్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పోలీసు సాక్షుల తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య వాదించారు. విచారణలో బాధితుడికి పరిహారం చెల్లించాలని జడ్జి తీర్పు వెల్లడించారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

- పంచ లోహ విగ్రహం, మూడు బైక్‌లు స్వాధీనం



మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: జిల్లాతో పాటు మేడ్చల్, రాజన్న సిరిసిల్లా, నిజామాబాద్ జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడిన నేరస్తుడిని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణ పీఎస్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. పట్టణంలో పీఎస్ పరిధిలో వాహనాలను తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న చిల్ల గంగాదాస్‌ను పట్టుకొని విచారించగా అతని నుంచి లక్ష్మీనృసింహ స్వామి పంచలోహ విగ్రహం, మూడు బైక్‌లతో పాటు రూ. 30 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంగదాసు పాత నేరస్తుడేనని, ఒకరిని హత్య చేసి జైలుకి వెళ్లి వచ్చినట్లు పేర్కొన్నారు. మేడ్చల్‌లో ఓ బైక్, గంభీరావుపేట, మాక్లూర్, గాంధారి, కామారెడ్డి పీఎస్ పరిధిల్లో దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. ఇతనికి సహాయపడుతున్న ఇద్దరు ప్రస్తుతం జైలులో ఉన్నట్లు పేర్కొన్నారు. వారిని విడిపించడానికి అవసరమైన డబ్బుల కోసమే నిందితుడు దొంగతనాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో దొంగల బీభత్సం

ఎడపల్లి: మండలంలోని పలు ఆలయాల్లో బుధవారం తెల్లవారు జామున దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయాల్లో ఉన్న హుండీ తాళాలను పగులగొట్టి నగదు, వెండి వస్తువులను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. బాపునగర్‌లోని సాయిబాబా, ఏఆర్పీ క్యాంప్‌లోని రామాలయంలో దొంగలు హుండీలను పగులగొట్టి అందులో ఉన్న నగదు, వెండి వస్తువులను ఎత్తుకెళ్లారన్నారు. ఆలయ అర్చకుల ఫిర్యాదు మేరకు పోలీసులను ఆలయాలను పరిశీలించి వివరాలు సేకరించారు.